నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

# నష్టం కలిగిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

## కలెక్టర్ వీపీ గౌతమ్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27 : రైతుల పంట ఉత్పత్తుల నాణ్యత విషయంలో నష్టం కలిగించే చర్యలకు పాల్పడే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని కలెక్టర్ వీపీ గౌతమ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి యార్డును సందర్శించిన కలెక్టర్ క్రయవిక్రయాలను తనిఖీ చేశారు. మిర్చి రైతులతో మాట్లాడుతూ పంట ఎంతమేరకు దిగుబడి వచ్చింది.. మార్కెట్‌లో ఎంత ధర లభిస్తున్నది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యమైన మిర్చి పంటకు ధర తగ్గిస్తే అలాంటి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ప్రతి బస్తా కొనుగోలు అయ్యే విధంగా చూడాలని, కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ అన్నారు. కాగా.. మిర్చి జెండాపాట క్వింటా ధర రూ.21,400 పలికింది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, పీడీఎంఐపీ రమణ, మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, ఏఈవో సాయి శిరణ్మయితోపాటు పలువురు మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.

# వారణాసి సమావేశంలో ఎంపీ వద్దిరాజు



సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి 27 : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి(బనారస్, కాశీ)లో మంగళవారం చైర్మన్ రమేశ్ విధురియ అధ్యక్షతన జరిగిన పెట్రోలియం సహజవాయువు పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సరఫరాకు సంబంధించిన తీరుతెన్నులు, నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశం చర్చించింది. సమావేశంలో స్థాయి సంఘం సభ్యులతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఖమ్మం : పరీక్షా హాలులో నెంబర్లు వేస్తున్న సిబ్బంది



# మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

## బస్తాలతో నిండిపోయిన అపరాలు, పత్తి యార్డు

## మిర్చి యార్డుగా మారిన మార్కెట్ రహదారులు



మిర్చి బస్తాలతో నిండిపోయిన అపరాలు, పత్తి యార్డు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27 : ఎర్ర బంగారం(తేజా మిర్చి)తో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పోటెత్తింది. మేడారం జాతర తర్వాత పంట రాక తగ్గుతుందని అధికారులు, వ్యాపారులు భావించినప్పటికీ అంచనాలకు మించి వివిధ జిల్లాల నుంచి రైతులు భారీగా సరుకును విక్రయానికి తరలించారు. రాత్రి సమయాల్లో, తెల్లవారుజామున వందలాది వాహనాల్లో వేలాదిగా బస్తాలు వస్తున్నప్పటికీ మార్కెట్ సిబ్బంది సరైన రీతిలో చర్యలు చేపట్టకపోవడంతో మార్కెట్ వెలుపల ఉన్న ప్రధాన వీధులు క్రయవిక్రయాలకు అడ్డాగా మారుతున్నాయి. ఉదయం జెండాపాట సమయానికి జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాల నుంచి దాదాపు 60 వేలకు పైగా బస్తాలను మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చారు. అయితే ప్రధాన యార్డులో సోమవారం రైతులు తీసుకొచ్చిన బస్తాల తోలకం పూర్తి కాలేదు. దీంతో అధికారులు అపరాలు, పత్తి యార్డుకు మిర్చి వాహనాలను తరలించారు. రెండు యార్డులు నిండిపోవడంతో ఆ తర్వాత రైతులు తీసుకొచ్చిన వేలాది బస్తాలను నడి రోడ్లపైనే దిగుమతి చేయాల్సి వచ్చింది. జెండాపాటలో క్వింటా గరిష్ఠ ధర రూ.21,400 పలికినప్పటికీ క్రయవిక్రయాలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. కాగా.. కొద్ది రోజుల నుంచి ఇష్టారీతిన బస్తాలు దిగుమతి కావడంతో కొనుగోలు చేసిన బస్తాలు మాయమవుతున్నాయని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల వ్యవధిలోనే 35 బస్తాలు మాయమయ్యాయని ఓ మిర్చి ఖరీదుదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఏదేమైనా మార్కెట్ అధికారులు రాత్రిపూట వచ్చే వాహనాలను నియంత్రించకపోతే మార్కెట్ వీధులే క్రయవిక్రయాలకు అడ్డాగా మారే అవకాశం ఉంది.

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఖమ్మం జిల్లాలో 36,578 మంది విద్యార్థులకు.. 70 కేంద్రాలు
- భద్రాద్రి జిల్లాలో 19,477 మంది విద్యార్థులకు.. 36 కేంద్రాలు
- నిమిషం నిబంధన పక్కాగా అమలు : డీఐఈవో రవిబాబు



టేకులపల్లి : పరీక్షా హాలులో సిబ్బంది వేస్తున్న నెంబర్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కల్పన

ఖమ్మం ఎడ్యుకేషన్/కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి మార్చి 14వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ప్రథమ, గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఖమ్మం జిల్లాలో 70, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 36 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనుండగా.. నిమిషం నిబంధనను కచ్చితంగా అమలు చేయనున్నట్లు ఇంటర్మీడియట్ అధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

### ఖమ్మం జిల్లాలో...

ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో రెగ్యులర్ విద్యార్థులు 16,015 మంది, ఒకేషనల్ విభాగంలో 2,466 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో రెగ్యులర్ విద్యార్థులు 15,905 మంది, ఒకేషనల్ విభాగంలో 2,192 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలను 36,578 మంది రాయనున్నారు. మొత్తం 131 కళాశాలల్లో 70 కేంద్రాలకు జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థులను కేటాయించారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 10 సిట్టింగ్ స్క్వాడ్స్‌లను నియమించారు. ప్రతి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఒక ఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ లెక్చరర్ ఉన్నారు. పరీక్షల నిర్వహణ హైపవర్ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఆర్‌జేడీ, డీఐఈవో, ఒక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, సబ్జెక్ట్ లెక్చరర్ సభ్యులుగా ఉండి పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. ప్రశ్నాపత్రాల పంపిణీ నుంచి విద్యార్థుల నుంచి సమాధాన పత్రాలు తీసుకునే వరకు ప్రతీది క్షుణ్ణంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగనున్నది.

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం 10,200 మంది, ద్వితీయ సంవత్సరంలో 9,277 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది శాఖాపరమైన అధికారులు, 13 మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహించనున్నారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, ఐదుగురు కస్టోడియన్స్‌ను నియమించారు.

### పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించరు. గట్టి బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశాం. విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తితే భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ 97046 61714, 99469 13069 నంబర్లలో సంప్రదించవచ్చు.

– సులోచనారాణి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

### నిమిషం నిబంధన పక్కాగా అమలు..



విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దు. ఈ నిబంధనను కచ్చితంగా పాటించాలి. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. 30 నిమిషాల ముందు నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సెంటర్ లోకేటెడ్ యాప్ ద్వారా పరీక్ష కేంద్రాలను గుర్తించవచ్చు (TSBIEM సర్వీసెస్). నేరుగా ఇంటర్ విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ లేకపోయినా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే డీఐఈవో కంట్రోల్ రూమ్ 99489 04023కు ఫిర్యాదు చేయొచ్చు.

– డీఐఈవో రవిబాబు

# పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలి

## సీఎస్, డీవోల సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : జిల్లాలో పదో తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 10,148 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 6,429 మంది, ప్రైవేట్‌గా 279 మంది.. మొత్తంగా 16,577 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 97 కేంద్రాలను ఎంపిక చేయగా.. 1,983 మంది ఇన్విజిలేటర్లు, 53 జోన్లు, 6 రూట్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 97 సిట్టింగ్ స్క్వాడ్స్, 97 సీఎస్, డీవోలను ఏర్పాటు చేశామన్నారు. ఇన్విజిలేటర్లకు లాటరీ పద్ధతి ద్వారా గదులు కేటాయించాలని, ప్రశ్నాపత్రంలో ప్రతి పేజీలో విద్యార్థి చేత హాల్ టికెట్ నెంబర్ రాయించాలన్నారు. సమావేశంలో డీఈవో సోమశేఖర శర్మ, ధనా, ఎంఈవో శ్రీనివాసరావు, రాములు, నారాయణ, వీరస్వామి, కార్యాలయ సిబ్బంది జీఎస్.ప్రసాద్, యూసఫ్, సీఎస్, డీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

### 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్స్, జాయింట్ కస్టోడియన్స్, రూట్ ఆఫీసర్స్‌తో ఆమె సమీక్షించారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ ఉంటుందని, మొత్తం 12,341 మంది విద్యార్థులు 33 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలను 23 పోలీస్‌స్టేషన్లలో భద్రపరచనున్నట్లు పేర్కొన్నారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు 73 మంది, 720 మంది ఇన్విజిలేటర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, డీఈవో వెంకటేశ్వరాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్టూడెంట్స్ ఆల్ ది బెస్ట్ : కలెక్టర్



కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల విద్యార్థులకు బెస్ట్ విషెస్ చెప్పారు. ఏడాదిపాటు కష్టపడి చదివిన విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా.. ధైర్యంగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు.. భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేకంగా 14416 టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సలహాలు, సూచనల కోసం రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 040-24601010, 040-24655027 నంబర్లకు కానీ.. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన 79979 94366, 89199 61013, 94418 17478 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

# త్వరితగతిన క్రాప్ సర్వే పూర్తి చేయాలి

## డీఏవో విజయనిర్మల



మామిడి తోటను పరిశీలిస్తున్న డీఏవో విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27 : యాసంగి పంటల డిజిటల్ క్రాప్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల అన్నారు. అర్బన్ మండలం మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని పంటల నమోదు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్బన్ మండలాన్ని డిజిటర్ క్రాప్ సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆ ప్రాంతంలోని వరి, పెసర, మామిడి, జామాయిల్ తోటలను పరిశీలించారు. ఆయా పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఏఈవోలకు ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఏడీఏ ఏ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి బీ కిశోర్, ఏఈవో సాయిశిరణ్మయి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరల బోర్డు పెట్టాలి

## భద్రాద్రి డీఏవో బాబూరావు



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న డీఏవో బాబూరావు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 27 : ఎరువుల దుకాణాల ఎదుట ధరలతోపాటు ఎరువుల నిల్వలు సూచించే పట్టికను ఏర్పాటు చేయాలని డీఏవో బాబూరావు వ్యాపారులకు సూచించారు. అశ్వారావుపేట, నారాయణపురం గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాపారులు దిగుమతి చేసుకున్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకూ రశీదు ఇవ్వాలని, ఆధార్ అనుసంధానంతోనే ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నారాయణపురంలో పంటలను సందర్శించిన ఆయన క్షేత్రస్థాయిలో పంటల నమోదు చేయాలని ఏఈవోలను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు, సలహాలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ఆయన వెంట అశ్వారావుపేట, దమ్మపేట ఏవోలు వై.నవీన్, చంద్రశేఖర్ రెడ్డి, పలువురు ఏఈవోలు ఉన్నారు.

# పంటలు కాపాడుకునేందుకు రణం

- పాలేరు రిజర్వాయర్ వద్ద రైతుల రాస్తారోకో
- ఒకటీ రెండు తడులకైనా నీరు విడుదల చేయాలని డిమాండ్
- పాత కాలువ గేట్లు ఎత్తి అనధికారికంగా దిగువకు నీటి విడుదల
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన



గేట్ల వద్ద ముళ్ల కంచెలను తొలగించి గేట్లను లేపుతున్న రైతులు

కూసుమంచి, ఫిబ్రవరి 27: ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పరిధిలోని పాలేరు జలాశయం కింద పంటలు సాగు చేస్తున్న రైతులు మంగళవారం సాగునీటి కోసం రోడ్డెక్కారు. అనధికారికంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. దీంతో రిజర్వాయర్ వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. తెలిసిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి పాలేరు జలాశయానికి ఏటా సీజన్లకు సాగు జలాలు విడుదలవుతాయి. కానీ ఎగువన సాగర్ ప్రాజెక్ట్‌లో జలాలు నిండుకోవడంతో పాలేరు జలాశయం ఎడారిని తలపిస్తున్నది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 13.5 అడుగులకు పడిపోయింది. మిగిలిన జలాలు కూడా 'మిషన్ భగీరథ' సరఫరా కోసమే అధికారులు రిజర్వ్ చేశారు. రిజర్వాయర్ కాలువలపై ఆధారపడి జిల్లాలో మెజారిటీ ఆయకట్టు ఆధారపడి ఉంటుంది. కూసుమంచి, నేలకొండపల్లి మండలాల ఆయకట్టు సాగునీటికి 90శాతం రిజర్వాయర్‌పైనే ఆధారపడి ఉంటుంది. ఆయా మండలాల్లో ప్రస్తుతం యాసంగిలో సుమారు 5వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ఇటీవల ఆయకట్టు రైతులు పాలేరు రిజర్వాయర్ వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. అనధికారికంగా పాతకాలువ నుంచి జలాలను దిగువకు వదిలారు. అధికారులు, పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం ఇరిగేషన్ అధికారులు పాతకాలువ గేట్ల వద్ద ముళ్లకంప వేశారు. ఇది జరిగి రెండు వారాలు కాకముందే రైతులు స్థానిక రాజకీయ నాయకులతో కలిసి మంగళవారం మరోసారి ఆందోళనకు దిగారు. రిజర్వాయర్ పాత కాలువ గేట్ల వద్దకు వెళ్లి ముళ్లకంపను తొలగించారు. రిజర్వాయర్ కట్టపై నుంచి వాహన రాకపోకలను అడ్డుకుని రాస్తారోకో చేశారు. అనంతరం గేట్లను తెరిచి దిగువకు జలాలు వదిలారు. సమాచారం అందుకున్న ఏసీపీ బి.తిరుపతిరెడ్డి, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్, ఈఈలు వెంకటేశ్వర్లు, అనన్య, డీఈలు రత్నకుమారి, మధు, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ మురళీ కృష్ణ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. కొన్ని గంటల పాటు రైతులతో చర్చలు జరిపారు. సుమారు 2 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, కనీసం ఒకటి రెండు తడులకైనా నీటిని వదలాలని రైతులు పట్టుబట్టారు. చివరకు ఇరిగేషన్‌శాఖ సీఈ విద్యాసాగర్ రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. అనంతరం అధికారులు పాతకాలువ గేట్లను మూసివేయించారు. తర్వాత రైతులు తమ స్వస్థలాలకు వెళ్ల కుండా రాత్రి రిజర్వాయర్ కాలువపైకి వచ్చి ఆందోళన చేశారు. అధికారులు గేట్లకు వెల్డింగ్ పెట్టకుండా అడ్డుకొని అక్కడే చలిమంటలు వేసుకొని కాపలాగా ఉన్నారు. కాగా.. అధికారులు సర్ది చెప్పడంతో రైతులు ఇళ్లకు వెళ్లారు.

# స్నేహ శిబిరానికి సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్



క్యాంపులో పాల్గొన్న సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 27 : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా కుర్సియాంగ్‌లో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించే 2వ ఇండో–బంగ్లాదేశ్ స్కౌట్స్ స్నేహ శిబిరానికి తెలంగాణ రాష్ట్రం తరఫున జీఎం పర్సనల్ బసవయ్య ఆధ్వర్యంలో సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నుంచి రాజ్య పురస్కార్‌కి అర్హత సాధించిన 11 మంది స్కౌట్స్, ముగ్గురు యూనిట్ లీడర్లను తెలంగాణ రాష్ట్రం తరఫున ఫ్రెండ్‌షిప్ క్యాంపులో పాల్గొనడానికి తీసుకెళ్లామని తెలిపారు. భారత్ నుంచి దాదాపు 300 మంది, బంగ్లాదేశ్ నుంచి 250 మంది వరకు స్కౌట్స్ అండ్ గైడ్స్, లీడర్లు క్యాంపులో పాల్గొన్నారని తెలిపారు. రెండు దేశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ మధ్య సాన్నిహిత్యం, సోదరభావం పెంపొందించడమే క్యాంపు ముఖ్యోద్దేశమన్నారు.